క్లుప్తంగా

ఉండి కో-ఆపరేటివ్ బ్యాంక్‌కు పూర్వవైభవం

ఉండి: నలుగురు బ్యాంకు సిబ్బంది చేతివాటంతో అవినీతిలో కూరుకుపోయిన ఉండి కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్‌కు మళ్ళీ పూర్వవైభవం తీసుకువచ్చినట్లు బ్యాంక్ అధ్యక్షుడు కనకరాజు సూరి తెలిపారు. బుధవారం బ్యాంకులో నిర్వహించిన సాధారణ సమావేశంలో బ్యాంకు ప్రగతి, అవినీతిపై చేపట్టిన చర్యలపై కనకరాజు సూరి పలువిషయాలు తెలిపారు. అన్ని సర్దుబాట్లు అనంతరం త్వరలోనే బంగారు రుణాలు, చెరువుల రైతులకు రుణాలు ఇస్తామని పేర్కొన్నారు. మొండి బకాయిలు వసూలుకు కృషి చేసిన ఇద్దరు బ్యాంకు సిబ్బందిని సత్కరించారు.

వ్యక్తి అదృశ్యం

ఆకివీడు: మండలంలోని గుమ్ములూరు గ్రామానికి చెందిన కొదమ మార్కురాజు ఈ నెల 19 నుంచి కనిపించడం లేదని అతని తండ్రి కొదమ విజయకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్నేహితుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆకివీడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: స్థానిక ఎస్సీ బోస్ కాలనీ పరిధిలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ లైన్లు మరమ్మతుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయునట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆనందపురం, మేకలదిబ్బ గూట్లపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కాళ్ల: మండలంలోని సీసలిలో దళితులపై దాడి ఘటనలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఇంత వరకు డీఎస్పీ దర్యాప్తు చేయకపోవడం పోలీసుల ఏకపక్ష వైఖరికి నిదర్శనమని, తక్షణం జిల్లా ఎస్పీ, డీఎస్పీలు దర్యాప్తు చేసి చర్యలు తీసుకోకుంటే జిల్లా వ్యాప్త ఉద్యమం చేపడతామని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటనలో విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదై నేటికి సుమారు 15 రోజులు పూర్తి కావస్తున్నా డీఎస్పీ దర్యాప్తు చేయకపోవడం అన్యాయమనిమండిపడ్డారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే రానున్న కాలంలో సీసలి ఘటనపై జిల్లా వ్యాప్త ఉద్యమానికి సిద్ధపడతామన్నాని హెచ్చరించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని వివరించారు. డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, పెనుగొండ, మొగల్తూరు ప్రాంతాల ప్రయాణికులు 99592 25486 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

గజల్ శ్రీనివాస్ తల్లి మృతి

పాలకొల్లు సెంట్రల్: ప్రముఖ గజల్ గాయకుడు కేశిరాజు శ్రీనివాస్ (గజల్ శ్రీనివాస్) తల్లి రత్నావళి (87) పాలకొల్లులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమెకు భర్త, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. బుధవారం ఆమె అంతిమ కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాపారవేత్త లగడపాటి రాజగోపాల్ శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

చిన్నారులకు పౌష్టికాహారం ఇవ్వాలి

పాలకొల్లు సెంట్రల్: పిల్లలకు పెట్టే ఆహారంలో ప్రోటీన్స్ ఉండేలా చూసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎం.ఉమ అన్నారు. బుధవారం స్థానిక లక్ష్మీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమ మాట్లాడుతూ ఆహారంలో ఉప్పు చక్కెరలు లేకుండా చూసుకోవాలని సూచించారు. తద్వారా ఊబకాయం తగ్గించడానికి తోడ్పడుతుందన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతో మేలు

పెనుగొండ: సామూహిక ఎలుకల నిర్మూలనతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆచంట వేమవరంలో జరిగిన సామూహిక ఎలుకల నిర్మూలనలో పాల్గొని రైతులకు విషపు ఎరను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, వ్యవసాయ శాఖ ఏడీఏ డాక్టర్ మురళీ కృష్ణ, వ్యవసాయాధికారి బి.నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు నెక్కంటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా పాహిమాం..!


పంచారామక్షేత్రంలో గాయత్రిదేవిగా అలంకరణ పార్వతిదేవి


ఆకివీడు: అన్నపూర్ణాదేవిగా పెద్దింటి అమ్మవారి అలంకరణ


కాళ్ల: కాళ్లకూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధైర్యలక్ష్మీ అలంకరణ


దనలక్ష్మీ అమ్మవారిగా శ్రీశారద మాత అమ్మవారు


గాయత్రి దేవిగా శ్రీరామపురం శ్రీజగన్మాత కనకదుర్గ అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు బుధవారానికి మూడో రోజుకు చేరాయి. మావుళ్లమ్మ దేవాలయంలో అమ్మవారు గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ ఆధ్వర్యంలో వేద పండితులచే వేదసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పంచారామక్షేత్రంలో ఉమాసోమేశ్వర జనార్ధనస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా బుధవారం పార్వతీదేవి అమ్మవారు గాయత్రి దేవిగా ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆకివీడులో..

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని భక్తులు పూజించారు. స్థానిక పెద్దింటి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. స్థానిక రాజ రాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజ, హోమం నిర్వహించారు. దసరా ఉత్సవాలు సందర్భంగా పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కాళ్లలో..

కాళ్ల: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కాళ్లకూరు గ్రామంలవెల్లన్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో మూడో రోజు బుధవారం ధైర్యలక్ష్మి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన శ్రీయతిరాజుల ఆండాల్ గోష్ఠి వారి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమపూజలు, అష్టోత్తర శతనామార్చన, ఆలయ ప్రదక్షిణం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


మెంటేవారి తోటలోని శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారికి వెండి బహూకరిస్తున్న దృశ్యం

పద్మావతి అమ్మవారికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో పద్మావతి అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో జేపీరోడ్డులో శ్రీ దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధం సంస్థ శ్రీ పద్మావతీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా పద్మావతి అమ్మవారికి ఉదయం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర పుష్పార్చన కుంకుమార్చన చేసి ప్రత్యేక అలంకరణ చేశారు.

ఉండిలో ఉచిత వైద్య శిబిరం


ఉండిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఉండి: నిరుపేదలు, రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించడం చాలా గొప్పపుణ్య కార్యమని డాక్టర్ గజపతిరాజు సాగిరాజు, పాస్టర్ స్టాన్లీథోమస్ అన్నారు. బుధవారం ఉండి బస్టాండ్ ఎదురుగా గుండాబత్తుల సుబ్బారావు స్థలంలో జిల్లా పాస్టర్స్ యూనియన్ ఎఫ్ఎఫ్‌సీఐ, ఉండి యుపీఏ సంయుక్త ఆధ్వర్యంలో వినాయక హాస్పటల్స్ యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో గైనకాలజీ, గ్యాస్ట్రిక్, జనరల్ మెడిసిన్, గుండె, కంటి సమస్యలపై ఉచిత వైద్య సేవలు అందజేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మంది పైబడి రోగులు వచ్చి వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి, రాజకీయవేత్త గుండాబత్తుల సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కరిమెరక శివనాగరాజు, యేడిద వెంకటేశ్వరరావు, గలావిల్లి ధనుంజయ, మునుకోలు సింహాచలం, అంగర రాంబాబు, రాయి సతీష్ ,జంపా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాత బస్టాండ్‌ను సందర్శించిన కేంద్రమంత్రి వర్మ

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పాత బస్టాండ్ ప్రాంగణంలో రూ. 55 లక్షలతో నిర్మించిన నూతన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను బుధవారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ బుధవారం సందర్శించారు. ప్లాట్‌ఫాంలు, రిజర్వేషన్ కౌంటర్‌ను, కార్గో కౌంటర్లను పరిశీలించి ప్రయాణికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ చేకూరి రామబద్రిరాజు, శ్రీమతి పార్వతీ దంపతుల ఆర్థిక సహకారంతో భీమవరం పాత బస్టాండ్ ప్రాంగణంలో నూతన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను నిర్మించడం అభినందనీయమని అన్నారు. నూతన బస్టాండ్‌లోని సౌకర్యాలపై మంత్రి శ్రీనివాస వర్మ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, నాయకులు కాయిత సురేంద్ర, షేక్ మొహిద్దిన్, అడబాలశివ, వబిలిశెట్టి ప్రసాద్, భూపతిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రయాణికులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి వర్మ

అంతర్గత రహదారులు అధ్వానం


31వ వార్డు చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కాలనీలో సగం పూర్తి చేసి వదిలేసిన అప్రోచ్‌రోడ్డు


- పట్టణంలో అస్తవ్యస్తంగా అప్రోచ్ రోడ్లు
- ప్రస్తుత వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణం

నరసాపురం: పట్టణంలో పలు వార్డుల్లో అప్రోచ్ రోడ్ల నిర్మాణంపై మున్సిపాలిటీ నిర్లక్ష్యం యాపిస్తోంది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. గతంలో ప్రస్తుత పాలకవర్గం హయాంలో మూడేళ్ల క్రితం దశల వారీగా పట్టణంలో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ప్రతిపాదనలు తయారు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. గత 20 ఏళ్లుగా పట్టణంలో అంతర్గత రోడ్ల నిర్మాణం విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోంది. ప్రధాన రహదారులు తప్పిస్తే, కాలనీల్లో అప్రోచ్‌రోడ్లను నిర్మించడంలేదు. ఫలితంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార్డుల్లో ప్రజలు ఎప్పటికప్పుడు మొరపెట్టుకుంటున్నా. మున్సిపాలిటీ అప్రోచ్‌రోడ్లు వేయడానికి ప్రయత్నమే చేయలేదు.

సందు తిరగాలంటే తిప్పలు

అప్రోచ్‌రోడ్లు లేకపోవడంతో పట్టణంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గట్టిగా వర్షాలు పడితే పరిస్థితి దారుణంగా ఉంటుంది. పట్టణంలో చినమామిడిపల్లిలో ఓఎన్జీసీ కాలనీలో పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మించారు. కానీ కాలనీ నుంచి ప్రధాన రోడ్డుకు చేరుకోవడానికి అప్రోచ్‌రోడ్లు లేవు. గత 25 ఏళ్ల నుంచి ఇక్కడ ఇదే పరిస్థితి. దీంతో మట్టిదిబ్బలను దాటుకుంటూనే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఎన్టీఆర్ కాలనీ, నందమూరి కాలనీ, వైఎస్సార్ నగర్, స్టేషన్‌పేట, గ్రేస్‌నగర్, పొన్నపల్లి ప్రాంతాల్లో ఇదే తరహా ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. దళితులు, పేదలు ఎక్కువగా ఉండే 27,28 వార్డుల్లోనూ, మున్సిపాల్టీ మురికివాడలుగా గుర్తించిన అరుంధతిపేట, మాధవాయిపాలెం ప్రాంతాల్లో కూడా అప్రోచ్‌రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికైనా అప్రోచ్‌రోడ్ల దుస్థితిపై మున్సిపాలిటీ దృష్టిపెట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

అప్రోచ్ రోడ్ల సమస్య ఉంది



వార్డుల్లో చాలా ప్రాంతాల్లో అప్రోచ్‌రోడ్లు లేకపోవడంతో ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దశల వారీగా అప్రో చ్‌రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అనుకున్నాం. కానీ జరగలేదు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వస్తే గానీ చేయలేము. ఈ దిశగా కౌన్సిల్‌లో చర్చించి ప్రయత్నం చేస్తాం. గతంలో తయారు చేసిన ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి.

-బర్రి శ్రీవెంకటరమణ, మునిసిపల్ చైర్‌పర్సన్

నరకానికి నకళ్లుగా రోడ్లు

- గుంతల్లో ప్రయాణం నిత్య నరకం
- మరమ్మతులైనా చేయించాలని ప్రయాణికుల వేడుకోలు

ఆకివీడు: నియోజకవర్గంలోని పలు రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. ఏడాదిన్నరగా కనీస మరమ్మతులకు నోచుకోకుండా ఆయా రోడ్లు ఉన్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లోని పలు రోడ్లతో పాటు, మండలాల్లోని ప్రధాన రోడ్లు, జాతీయరహదారి 165, రాష్ట్ర రహదారి నియోజకవర్గంలో అధ్వానంగా తయారయ్యాయి. భీమవరం-ఏలూరుపాడు రాష్ట్ర రహదారి పలు చోట్ల అధ్వానంగా తయారైంది. గుంతలు గుంతలతో ప్రయాణికులు, వాహనచోదకులు అనేక అవస్థలు పడుతున్నారు. జాతీయరహదారి 165 విస్సాకోడేరు నుండి వీరవాసరం వరకూ అధ్వానంగా తయారైంది. ఈ రహదారి గుంతలతో వాహనాల్ని ఏ వైపు నుంచి నడపాలో తెలియని స్థితి ఏర్పడిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ రోడ్లు మరీ అధ్వానం

నియోజకవర్గంలోని పాలకోడేరులోని భీమవరం పైపుల చెరువు రోడ్డు, వేంద్ర నుంచి మోగల్లు, భీమవరం నుంచి అత్తిలి వెళ్లే రోడ్డు కుముదువల్లి, పాలకోడేరు, మోగల్లు, కోరుకొల్లు గ్రామాల్లో రహదారి ఛిద్రమైపోయింది. ఆకివీడు మండలంలోని అయిభీమవరం-ఏలూరుపాడు రహదారి, కుప్పనపూడి-కోనలపల్లి రహదారి, రాజులపేట రోడ్డు, పెదకాపవరం-కొవ్విడి, పాములపర్రు-కొల్లేరు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కాళ్ల మండలంలోని పల్లెపాలెం-బోసుకాలనీ, ఉండి మండలంలోని వాంద్రం గ్రామపరిధిలో, చిలుకూరు-గరగపర్రు రోడ్డు, యండగండి నుంచి ఉప్పులూరు, ఉండి-గణపవరం రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులకు కనీసం మరమ్మతులైనా చేయించాలని ప్రజలు వేడుకుంటున్నారు.


అయిభీమవరం-ఏలూరుపాడు రోడ్డు దుస్థితి


పాలకోడేరు మండలంలో దుక్కి వర్షానికి ముంపునకు గురై కదలని మురుగు నీరు

రహదారులను పునర్నిర్మించాలి



నియోజకవర్గంలో పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మండలానికి అనుసంధానంగా ఉన్న రోడ్లతో పాటు, మండలంలోని ఇంటర్నల్‌రోడ్లు కూడా పాడైపోయాయి. ఏడాదిన్నరగా రోడ్ల పునర్నిర్మాణ పనులు చేపట్టలేదు. నిధులు మంజూరైన రోడ్లు పున్నిర్మాణం చేపట్టాలి. తాత్కాలిక మరమ్మతులు కొన్ని రోడ్లకు మాత్రమే చేయడంతో మిగిలిన రోడ్లు పాడైపోయాయి.

– కఠారి రామకృష్ణ (రాము), పెదకాపవరం, ఆకివీడు మండలం

విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలి

భీమవరం: విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలని, ఎన్ఎస్ఎస్ యూనిట్లు ప్లాస్టిక్ నిషేధంపై ఉద్యమించాలని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కేజీఆర్ఎల్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాఐ శ్రీరామచంద్రరెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ అంటేనే సేవా అని, యువత జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. గాంధేయ విధానాలతో గ్రామాల్ని అభివృద్ధి పరచడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముందుండాలని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలలో పుష్కరాల్లో తీర్థ వేడుకల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు చిత్తశుద్ధిగా సేవలు అందిస్తారని, అన్ని కళాశాలలో విశ్వ విద్యాలయలలో ఈ యూనిట్లు నెలకొల్పుతారని, ఎన్ఎస్ఎస్ అంటేనే సేవలు భావాలు పెంపొందించుకోవడమని తెలిపారు. అనంతరం నాట్యంలో గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించిన 9 ఏళ్ల చిన్నారి సాయి తన్వికను అభినందించి ప్రశంసా పత్రాన్ని అందించారు. అదే విధంగా పట్టణంలోని వివిధ కళాశాలలోని 24 మంది ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లను, 45 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల పిజి డైరెక్టర్ డా తోట రామ్మూర్తి, బి ఫార్మసీ డైరెక్టర్ కవల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాఘవ, కష్ణ చైతన్య, సోమయ్య, పి మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఎస్ఎస్ వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్ఆర్‌కేఆర్‌లో ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన వివిధ పోటీల్లో గెలుపొందిన ఎన్ఎస్ఎస్ కార్యకర్తలకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్ కృష్ణ చైతన్య ఉత్తమ వలంటీర్లకు ప్రశంసా పత్రాల అందజేశారు. అనంతరం సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సహాయ కోఆర్డినేటర్ డాక్టర్ కే ఎన్ వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఆర్‌కేఆర్‌లో ఎన్ఎస్ఎస్ కార్యకర్తలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

ఆకివీడు: సమాజం నాకేమి ఇచ్చింది అనే కన్నా, సమాజానికి నేను ఏమిచేశాననే భావమే సేవా భావమని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు.మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవాభావం పెంపొందించుకోవాలన్నారు. సమాజానికి తన వల్ల చేయగలిగిన సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.ఓగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో సేవా భావం పెంపొందుతుందన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుజాత.

దళారులను నమ్మి మోసపోవద్దు

పెనుగొండ: రైతులు ధాన్యం అమ్మకాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని పెనుగొండ మండల వ్యవసాయ అధికారి పి.స్పందన అన్నారు. బుధవారం పెనుగొండ సిద్ధాంతం సొసైటీలో ఖరీఫ్ సీజన్ 2025కు సంబంధించి ధాన్యం కొనుగోలుపై ముందస్తు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో స్పందన మాట్లాడుతూ రైతులు ధాన్యం అమ్ముకునేందుకు రైతు కేంద్రాల ద్వారా తమకు నచ్చిన మిల్లులకు తరలించుకోవచ్చని సూచించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే ధాన్యం మిల్లులకు రైతులు వెళ్లకుండా, స్థానిక అధికారులనే సంప్రదించాలని కోరారు. అలాగే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా యూరియా పై రైతులకు అవగాహన కల్పించారు. యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు ప్రజాప్రతినిధులు రైతులతో కలిసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ కౌరు శ్రీరామ్మూర్తి, ఏఎంసీ డైరెక్టర్ చింతపల్లి జేమ్స్, నీటి సంఘ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సిద్ధాంతం సొసైటీలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి స్పందన